క్లుప్తంగా

వార్షికోత్సవ పూజలు



మరికల్: మండల కేంద్రంలోని దత్తాత్రేయ స్వామి ఆలయ వారికోత్సవ పూజ కార్యక్రమాలను భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటింటి నుంచి మంగళహారతులతో ఊరేగింపుగా వచ్చి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజారి కిష్టప్పస్వామి భక్తులకు దత్తాత్రేయ చరిత్రను వివరించారు. భక్తులకు తీర్థప్రసాదలు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి

మాగనూర్: తళంకేరి గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని మాగనూర్ ఎంపీపీ శ్యామలమ్మ తనిఖీ చేశారు. సమస్యలు ఉన్నవారు కంటివెలుగును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. సర్పంచ్ రామస్వామి, ఉపసర్పంచ్ బాలప్ప, డాక్టర్ రాఘవేంద్ర, శిరీష, సిబ్బంది గిరిజ, సుధా, రవి, అజయ్ , ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

మరికల్: ఇటుక బట్టీల దగ్గర ఉండే ఇతర రాష్ట్రల నుంచి వలస వచ్చిన కార్మికుల పిల్లలకు అక్కడి యాజమాన్యం నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఎంఓ విద్యసాగర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎమ్మోనోన్నిపల్లి శివారులో ఉన్న బట్టీల దగ్గర వర్కింగ్ స్కూల్‌ను సందర్శించారు. కార్మికుల పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఆర్పీ శివ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నర్వ: మండంలోని పాథర్చేడ్ గ్రామ శివ సాయిబాబ ఆలయానికి నర్వ పీఏసీఎస్ చైర్మెన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి విరాళం అందించారు. ఆలయ నిర్వాహకుల అభ్యర్థన మేరకు రూ.20వేలు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దాతను శాలువ, పూలమాలలతో సత్కరించారు. విశ్రాంత హెచ్‌ఎం బి.సంజన్న, పీఏసీఎస్ డైరెక్టర్ పల్లెశేఖర్, కృష్ణయ్య, నర్సిములు, శ్రీధర్, రామన్‌గౌడ్, కురుమయ్య తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నారాయణపేట రూరల్ : మండలంలోని అప్పంపల్లి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ సురేష్‌గౌడ్ కథనం మేరకు.... ధన్వాడ మండల కేంద్రానికి చెందిన తిరుపతయ్య తన ద్విచక్రవాహనంపై శుక్రవారం ఉదయం నారాయణపేట వస్తున్నాడు. ఈ క్రమంలో గడ్డమీద అప్పంపల్లి దగ్గర ముందు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడిపిస్తూ ఎలాంటి హెచ్చరికలు లేకుండా సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక ఉన్న ద్విచక్రవాహనం వెళ్లి డీసీఎంను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో శుక్రవారం నాయకుడు కిషన్‌రావు జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ స్వప్న ఆధ్వర్యంలో కిషన్‌రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు గొల్ల జమ్మన్నకు ట్రై సైకిల్ పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు పలకలు, వాటర్ బాటిల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీలి నరసింహులు, కిషన్‌రావు యువసేన తదితరులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

చిన్నచింతకుంట: సల్ఫేట్ లోపంతో వరిపంటలో దుష్ప్రభావం సంభవిస్తుందని మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అప్పంపల్లిలో రైతులు సాగు చేసిన వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేలమడి మెత్తగా ఉండే బురద నేలలో సల్ఫేట్ లోపం ఏర్పడుతుందన్నారు. మొక్క వేర్లకు గాలి తగిలే విధంగా పొలంలో సన్నని నెర్రలు వచ్చే వరకు ఆరబెట్టి నీటిని పెడుతూ ఉండాలన్నారు. కలుపు తీసిన తరువాత ఒక ఎకరానికి 25-30 కేజీల యూరియా, 25శాతం కార్బండిజం, 50శాతం మాంకోజెబ్ పొడి మందును కలిపి బురదపదునులో చల్లాలని తెలిపారు. జింక్‌లోపం ఉన్నట్లయితే 2గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్‌నీటిలో కలిపి ఐదురోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని తెలిపారు. అధికారుల సూచనలతో పంట సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించుకోవాలన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

- కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు
- సబ్జెక్టు టీచర్ల సూచనలతో వంద రోజుల ప్రణాళిక
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

ధన్వాడ: పదో తరగతి తుది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ మేరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జిల్లాలోని దాదాపు అన్ని పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. సబ్జెక్టు టీచర్ల సూచనలతో వంద రోజుల ప్రణాళికను పక్కగా అమలు చేసేందుకు కృషిచేస్తున్నారు. అదేవిధంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. కాగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరు పేపర్లు మాత్రమే నిర్వహిస్తుండడం, క్వశ్చన్ పేపర్‌లో మార్పులు చేయడంపై విద్యార్థులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ప్రయత్నిస్తే పది పాయింట్లు సులభంగా సాధించవచ్చని విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు. పది జీపీఏ సాధించేందుకు విద్యార్థులు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు సూచించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెడితే సరిపోతుందని చెబుతున్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు, విద్యార్థులు వ్యక్తిగతం10 జీపీఏలను సాధించేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నారు. నవంబర్ నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రమేష్‌శెట్టి ఆధ్వర్యంలో తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులను గ్రూపులుగా విభజించి నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషిచేస్తున్నారు. పాఠశాలలో మొత్తం 135 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిని మొత్తం 19 మంది ఉపాధ్యాయులకు ఒక్కొక్కరికి 7 మంది చొప్పున కేటాయించారు. తదనుగుణంగా సదరు ఉపాధ్యాయులు తమకు కేటాయించిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారు మెరుగుపడేందుకు కృషిచేస్తున్నారు. అదేవిధంగా తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు సహకరించాలని కోరుతున్నారు.

ఉపయోగకరంగా ఉన్నాయి



చదువులో వెనుకబడిన వారికి, పాఠ్యాంశాలు అర్థం కాని వారికి ప్రత్యేక తరగతులు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రత్యేక తరగతుల్లో సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం. అదేవిధంగా పాఠ్యాంశాలపై మరింత పట్టు పెంచుకుంటున్నాం.

– మురళి, 10 తరగతి విద్యార్థి, బాలుర ఉన్నత పాఠశాల, ధన్వాడ

ప్రత్యేక ప్రణాళికతో సాగుతున్నాం



ప్రతి విద్యార్థి 10 పాయింట్లు సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. పరీక్షలు అనే భయాన్ని వీడి నమ్మకం పెంచుకోవాలి. అప్పుడే పరీక్షలు బాగా రాయగలుగుతారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారికి సహకారం అందించాలి.

– రమేష్ శెట్టి, ప్రధానోపాధ్యాయులు, బాలుర ఉన్నత పాఠశాల, ధన్వాడ

నాణ్యమైన భోజనం అందించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటయ్య

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు వంట ఏజెన్సీలు నాణ్యమైన భోజనం అందించాలని జెడ్పీటీసీ వెంకటయ్య అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని వర్కూర్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం వంట గదిలోని సరకులను తనిఖీచేశారు. మెనూ పాటించాలని తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్

మరికల్: మండలంలో ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని తహసీల్దార్ రామ్‌కోటి అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌ఓ, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ నెల ఆఖరులోపు పూర్తి చేసేలా కృషి చేయాలన్నారు. డీటీటీ శ్రీనివాస్, ఆర్‌ఐ శ్రీశైలం, గోపాల్‌రావు, రవికుమార్, మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులు



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మక్తల్: గుడిగండ్లలో శుక్రవారం ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. బహుమతులు అందుకున్నారు. కలెక్టర్‌గా కల్యాణి, డీఈఓగా గాయత్రి, డిప్యూటీ డీఈఓ స్పందన, ఎంఈఓగా అఖిల, హెచ్‌ఎంగా కృష్ణయ్య వ్యవహరించారు.

చిరుధాన్యాల్లో పోషకాలు మెండు



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ చందన

కోస్గి: చిరుధాన్యాల్లో పోషకాలు మెండుగా ఉంటాయని ఏఈఓ చందన అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని బలభద్రాయపల్లి గ్రామంలో చిరుధాన్యాల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సమితి అధ్యక్షుడు రాంచందర్, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేటలో వైద్య విజ్ఞాన సదస్సు



నారాయణపేట రూరల్ : పట్టణంలోని శ్రీసత్యనారాయణస్వామి దేవాలయంలో గ్రామీణ వైద్య సేవకుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పట్టణంలోని శ్రీసాయి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ గందె కార్తిక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాధారణ జ్వరాలు, ఫిట్స్, బీపీ, డయాబెటీస్, పెరాలసిస్, గుండెనొప్పి తదితర వాటికి ప్రథమ చికిత్స చేసే విధానం తెలియచేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అందిస్తాం



పాథర్చేడ్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

నర్వ: రాష్ట్రంలో వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ అధికారంలోకి వస్తే రాజశేఖర్ రెడ్డి తరహాలోనే సంక్షేమ పథకాలను అందిస్తామని మక్తల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కర్ని గంగాధర్ అన్నారు. శుక్రవారం పాథర్చేడ్ గ్రామంలో ఇంటింటికీ వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు మైబు, మక్తల్ మండల అధ్యక్షులు నరేందర్, నాగరాజు రెడ్డి, శంకర్, వడ్డె రవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ రవిబాబు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ రవిబాబు అన్నారు. స్థానిక పీఎస్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశమైన సీఐ మాట్లాడుతూ.. ప్రతీ ఆటో కండీషన్‌లో ఉంచాలని, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. భద్రత, బాధ్యతతో పాటు నమ్మకంగా గమ్యస్థానానికి చేర్చాలన్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడం, ఇతర వాహనాలకు ఇబ్బంది కల్గించే విధంగా రోడ్లపై డ్రైవింగ్ చేయడం సరికాదన్నారు. ప్రతీ వాహనానికి నెంబర్‌ప్లేట్ ఉండాలని, లేకపోతే సదరు వాహనాలను క్రైమ్ చేయడానికి వాడుతున్నారని గుర్తించాల్సి వస్తుందన్నారు. నిబంధనల ప్రకారమే నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేయాలని, ఇష్టారీతిగా ఉండరాదని సూచించారు. అదేవిధంగా జర్నలిస్టులు కానివారు ప్రెస్ స్టిక్కర్లు పెట్టకోరాదన్నారు. అతివేగం ప్రమాదకరమని, నిర్ణీత వేగంతోనే వాహనాలను నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని, ఇతర వాహనాలకు ఆటంకం కల్గిస్తే ఫైన్ కట్టాల్సి వస్తుందన్నారు.

సరిహద్దులో వాహనాల తనిఖీ



కృష్ణా: మండంలలోని టై రోడ్డులో శుక్రవారం మండల పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. ఇందులో ఏఎస్‌ఐ సురేందర్‌బాబు తో పాటూ ఇతర సిబ్బంది ఉన్నారు.

రేపు శంకరభారతి తీర్థ స్వామి రాక

నారాయణపేట రూరల్: కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని ఎడతొరె యోగనందేశ్వర మఠం పీఠాధిపతి శంకర భారతి తీర్థస్వామి నారాయణపేటకు రానున్నారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు పరిమళాపురంలో ఉన్న 800 సంవత్సరాల చరిత్ర కల్గిన నిమజ్జనం ఎరుగని వినాయకుడిని దర్శించుకుంటారు. 6గంటలకు ధార్మిక ప్రవచనం, సోమవారం వినాయక, శ్రీరామ పూజలు, తీర్థ ప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమా లు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఊట్కూరు: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, తెలంగాణ ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఊట్కూరులో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని గాంధీనగర్ బీసీ కాలనీ ప్రాంతాలలో వెన్నెల కల్చర్ అకాడమీ కళాకారులు ఆటపాట, మాటల ద్వారా ఎయిడ్స్ నియంత్రణపై వివరించారు. సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, నాయకులు జమీర్ అలీ, ఐకేపీ సిబ్బంది వెంకటేశ్వరమ్మ, స్టేట్ రీసోర్స్‌పర్సన్ మాదుగుల నర్సింహా, కళాకారులు ఉదయ్‌కుమార్, పార్వతీశం, వెంకటేశ్ పాల్గొన్నారు.

'హామీ నిలబెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం'

నర్వ: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని వాల్మీకి బోయ సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం విలేకరుల సమవేశంలో మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం ఎస్టీ జాబితాలో చేర్చడంపై శుక్రవారం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, జిల్లా మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డిలతో పాటు నియోజకవర్గ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. విండో వైస్ చైర్మెన్ లక్ష్మన్న, మండల సంఘం అధ్యక్షులు గడ్డం నర్సిములు, రైతు సమితి మండల కోఆర్డీనేటర్ మండ్ల చిన్నయ్య, నాయకులు భగవంతు, ఎంపీటీసీ నీరజ్, అయ్యన్న, ఉమాపతి, రాములు డీలర్ హన్మంతు, కొత్తపల్లి ఆంజనేయులు, నాగిరెడ్డిపల్లి వెంకటయ్య, తదితరులున్నారు.

మరికల్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు శుక్రవారం అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయడంపై సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మిఠాయిలు తినిపించుకున్నారు. మండల అధ్యక్షులు నర్సిములు, జిల్లా నాయకులు చంద్రప్ప, రఘు, రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20కోట్లతో డివైడర్ పనులు

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో రూ.1.20 కోట్ల వ్యయంతో డివైడర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పురపాలిక వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం గాంధీచౌక్ నుంచి అమరచింత రోడ్డు వైపు చేపడుతున్న డివైడర్ పనులను వారు పరిశీలించారు. గాంధీచౌక్ నుంచి బస్టాండ్ రోడ్డు వైపున త్వరలోనే డివైడర్ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పూర్తయిన వెంటనే రోడ్డు మధ్యలో బట్టర్‌ఫ్లై విద్యుత్ స్థంబాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. స్థానికులు, ప్రయాణికులు డివైడర్ పనులకు సహకరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కౌన్సిలర్ మండ్ల రామకృష్ణ, మాసన్న, రియాజ్‌అలీ, రవీందర్‌రెడ్డి ఉన్నారు.



నూతన మసీదు నిర్మాణ పనులు ఆపాలి

అమరచింత: పట్టణంలో జామీయా మసీదు కమిటీకి సమాచారం ఇవ్వకుండా ముస్లిం మైనార్టీల అభిప్రాయం లేకుండా నూతనంగా నిర్మిస్తున్న మసీదు నిర్మాణ పనులను ఆపాలంటూ మున్సిపల్ ఆర్‌ఐ కృష్ణయ్యకు మసీదు కమిటీ సభ్యులు శుక్రవారం వినతిపత్రం అందించారు. మసీదు నిర్మాణం వల్ల ముస్లింల ఐఖ్యత దెబ్బతింటుందన్నారు. నూతన మసీదు నిర్మాణం చేపట్టకూడదని జామీయా మసీద్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిందని వారు మున్సిపల్ అధికారులకు విన్నవించారు. పట్టణంలోని కబరస్తాన్‌లో రెహమనీయా మసీదు నిర్మాణం సమయంలో చాలాసార్లు సమావేశాలు, చర్చలు జరిగిన తర్వాత నిర్మాణం జరిగిందన్నారు. పట్టణ ముస్లింల అభిప్రాయం, ముస్లిం కమిటీ సభ్యుల తీర్మాణం లేకుండా నిర్మిస్తున్న మసీదు నిర్మాణ పనులకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని కోరారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, కమిటీ సభ్యులు కుతుబ్, తౌఫిక్, అన్సారీ, అక్బర్, ఖాజా, పాష, మలంగ్, మహిమూద్, గౌస్, షాకీర్, అబిద్ పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

నారాయణపేట రూరల్ : అడ్మిషన్ సమయంలో చెప్పిన విధంగా పాఠశాల నడపటం లేదని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంతో ఓ విద్యార్థి తల్లిదండ్రులు గొడవకు దిగారు. పట్టణంలోని ఓ ఆస్పత్రి భవనం పైన కొత్తగా ఏర్పాటు చేసిన సదరు పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థికి ఏటా రూ.37,000 చొప్పున ఫీజు నిర్ణయించి వసూలు చేశారు. చక్కటి స్టాండర్డ్స్‌తో పాటు అబాకస్ నేర్పిస్తామని హామీ ఇచ్చారు. దీనికి తోడు వారానికి ఒకసారి పిల్లలకు రీ ప్రెష్‌మెంట్ కోసం పిక్‌నిక్, రోజు పాఠశాలలో పిల్లలకు పండ్లు, బిస్కెట్స్ వంటివి అందిస్తామని చెప్పారు. అయితే పాఠశాల ప్రారంభమై ఎనిమిది నెలలు గడుస్తున్నా విద్యార్థిలో ఎలాంటి అభివృద్ధి కనిపించక పోవడంతో తల్లిదండ్రులు యాజమన్యాన్ని కలవడానికి వెళ్లారు. ప్రిన్సిపాల్, మేనేజ్‌మెంట్ పేరెంట్స్ మీటింగ్ పెట్టకుండా ముఖం చాటేస్తున్నారని ఆరోపించారు. దీంతో శుక్రవారం సాయంత్రం స్కూల్ ముందు ఆందోళన చేశారు. కనీసం పూర్తిస్థాయిలో టీచర్లు, ఆయాలను పెట్టలేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న కొందరు పెద్దలు కలగచేసుకుని పేరెంట్స్‌తో మాట్లాడారు. చివరికి శనివారం ఉదయం మాట్లాడి ఇష్టంలేని వారికి డబ్బులు రిటర్న్ చేస్తామని చెప్పడంతో వెనక్కి వెళ్లారు.

పాఠశాల సమయానికి బస్సులు నడపాలి



కొంకన్‌వానిపల్లిలో బస్సు ఎక్కడానికి గుమిగూడిన విద్యార్థులు

అమరచింత: పాఠశాల, కళాశాల సమయానికి ఆర్టీసీ బస్సులు నడపాలని ఏబీవీపీ జిల్లా నాయకుడు వినోద్ డిమాండ్ చేశారు. మండలంలోని కొంకన్‌వానీపల్లి, పాంరెడ్డిపల్లి గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది విద్యార్థులు అమరచింత, ఆత్మకూర్, కొత్తకోట, వనపర్తి పట్టణాల్లో చదువుకోవడానికి వస్తుంటారు. ప్రతి రోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకు ప్రతి అరగంటకు ఒక ఆర్టీసీ షటిల్ సర్వీస్ నడపాలని, అప్పుడే విద్యార్థులు సకాలంలో పాఠశాల, కళాశాలలకు చేరుకుంటారని తెలిపారు. పాఠశాలల సమయానికి బస్సులు నడపాలని పలుమార్లు నారాయణపేట, గద్వాల, వనపర్తి డిపో మేనేజర్లకు వినతిపత్రాలు ఇస్తున్న ఫలితం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ గద్వాల డిపోకు చెందిన ఒక ఆర్టీసీ షటిల్ బస్సునే మరికల్, ఆత్మకూర్ వరకు కొనసాగిస్తుండటంతో విద్యార్థులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాల సమయానికి బస్సులు కొనసాగించేందుకు చొరవ చూపాలని కోరారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో అనిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న దర్శనానికి తరలిన భక్తులు



పేట నుంచి తరలివెళ్తున్న శివ భక్తులు



వడ్వాట్‌లో ఇరుముడులు ధరిస్తున్న శివభక్తులు

నారాయణపేట టౌన్ : పట్టణంలో స్థానిక అంబన్న బావి అమరేశ్వర స్వామి దేవాలయం నుంచి 50 మంది స్వాములు, సుభాష్‌రోడ్‌లోని బారంబావి శివాలయం నుండి 20 మంది స్వాములు శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనానికి పాదయాత్రగా తరలివెళ్లారు. మంత్రోచ్చారణలతో బండి గోపాల్‌రెడ్డి గురుస్వాములు ఇరుముడిని కట్టారు. ఈ సందర్భంగా కుర్వల మల్లయ్య గురుస్వామి 70 మంది భక్తులను శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మండల కేంద్రం నర్వ, జక్కన్నపల్లిలో శుక్రవారం శివనామస్మరణ శుక్రవారం మార్మోగింది. శివభక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఇరుముడులు ధరించారు. శ్రీశైలనానికి పాదయాత్రగా తరలి వెళ్లారు.

మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో శివ భక్తులు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. అంతకుముందుకుగురుస్వాముల ఆధ్వర్యంలో పూజలు చేసి ఇరుముడులు ధరించారు.

ఊట్కూరు: మండలంలోని మొగ్దుంపూర్‌లో శుక్రవారం 20 మంది శివభక్తులు శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. కార్యక్రమంలో గురుస్వాములు నర్సింహులు, రాజేశ్, కనకప్ప, అంజప్ప, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని ఎలిగండ్ల నుంచి శుక్రవారం శివ భక్తులు శ్రీశైలానికి పాదయాత్రగా తరలి వెళ్లారు. శివరాత్రి నాటికి అక్కడకు చేరుకుంటామని తెలిపారు.

కృష్ణా: మండలంలోని తంగిడి గ్రామానికి చెందిన శివభక్తులు శుక్రవారం ఇరుముడి కట్టుకొని శ్రీశైలానికి పాదయాత్రగా బయలు దేరారు. అంతకు ముందు గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. మహిళా భక్తులు మంగళహారతులతో వారిని సాగనంపారు.